క్లుప్తంగా

మొక్కలు నాటితేనే మానవ మనుగడ



బాన్సువాడ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలు నాటితేనే మానవ మనుగడ ఉంటుందని హరిత సేన రాష్ట్ర కో ఆర్డినేటర్ గుర్రెపల్లి సతీష్ అన్నారు. మంగళవారం బాన్సువాడకు వచ్చిన హరిత సేవ బృందం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ తలపెట్టిన గ్రీన్ చాలెంజ్, హరిత సేన కార్యక్రమం అన్ని నియోజకవర్గాల్లో కొనసాగుతుందని అన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిగా జుబేర్..

బాన్సువాడ నియోజకవర్గ హరిత సేన ఇన్‌చార్జిగా జుబేర్‌ను నియమిస్తున్నామని రాష్ట్ర కో ఆర్డినేటర్ గుర్రెపల్లి సతీష్ అన్నారు. బాన్సువాడ పట్టణ ఇన్‌చార్జిగా గాండ్ల కృష్ణ, నస్రుల్లాబాద్ మండల ఇన్‌చార్జిగా నర్సింలు గౌడ్, అఫ్రోజ్, మోస్రా మండల ఇన్‌చార్జిగా మక్బుల్, రుద్రూర్ మండలఇన్‌చార్జిగా గాండ్ల మధు, చందూర్ మండల ఇన్‌చార్జిగా మాధవ రెడ్డి, పొతంగల్ మండల ఇన్‌చార్జిగా నవీన్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాచారెడ్డి : పాల్వంచ, మాచారెడ్డి మండలాల్లోని కల్లు డిపోలు, దుకాణాలలో తప్పనిసరి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ సూచించారు. మంగళవారం పోలీస్ ఠాణాలో కల్లు ముస్తేదార్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు,మైనర్లను కల్లు కాంపౌండ్ లోనికి అనుమతి ఇవ్వొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



భిక్కనూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి వేణుగోపాల్, మండల విద్యాధికారి రాజ గంగారెడ్డి, పాఠశాల ప్రదానోపాధ్యాయులు శ్రీనాథ్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి అన్నీ తానై..



కామారెడ్డి అర్బన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మంగళవారం మధ్యాహ్నం ఒంటిపై బట్టలు లేకుండా ఎండలో కొట్టుమిట్టాడుతున్న ఓ అభాగ్యుడిని ఎవరు పట్టించుకోవడం లేదు. అటుగా వెళ్లిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.భాగయ్యకు ఆ అభాగ్యుడికి బట్టలు కట్టించి మంచి నీళ్ల తాగించి, టీ బ్రెడ్ తినిపించి ఔదార్యం చాటుకున్నారు.

నిర్మానుష్యంగా మారిన మాచారెడ్డి చౌరస్తా రోడ్డు



మాచారెడ్డి: ఎండలు మండుతుండడంతో మంగళవారం అంగడి రోజు జనం లేక మాచారెడ్డి చౌరస్తాలోని కామారెడ్డి సిరిసిల్ల రోడ్డు నిర్మానుష్యంగా మారింది. పొద్దంతా జనంతో రద్దీగా ఉండేది. గురువారం మధ్యాహ్నం మాచారెడ్డి చౌరస్తాలో 37డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

గురుకులాలకు ఎంపిక

రాజంపేట : టీజీసెట్ ప్రవేశపరీక్షలో శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 23 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 21 మంది విద్యార్థులు గురుకులాకు ఎంపికయ్యారని మంగళవారం పాఠశాల హెచ్‌ఎం విక్రాంత్ తెలిపారు.





విరిగిపోయిన తాగునీటి నల్లాలు, పార్కులో తొలగిపోయిన వాకింగ్ కోసం ఏర్పాటు చేసిన టైల్స్



దెబ్బతిన్న ఆట వస్తువులు

కళావిహీనంగా మారిన రాజీవ్‌పార్క్

- పట్టించుకోని బల్దియా అధికారులు
- మరమ్మతులకు నోచుకోని ఆట సామగ్రి



సిరిసిల్లా రోడ్‌లోని రాజీవ్ పార్క్

కామారెడ్డి టౌన్: పట్టణంలోని సిరిసిల్లా రోడ్‌లో గల రాజీవ్‌పార్క్ కళావిహీనంగా మారిపోయింది. పాలకులు, బల్దియా అధికారులు పార్కును పట్టించుకోవడలేదు.గతంలో ఈ పార్కు నిండా తివాచిలా పచ్చని గడ్డి, వాటర్ ఫౌంటేన్ అందాలు, విద్యుత్‌దీపాలు, పచ్చని చెట్లు, చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట సామగ్రి ఉండేవి. ఈనెలలోనే విద్యాసంస్థలకు సెలవులు వస్తున్నాయి. పుర ప్రజలు కుటుంబ సభ్యులతో సాయంకాలం కాసేపు కాలక్షేపం కోసం ఆహ్లాదకరమైన పార్కు లేకుండా పోయింది.

2006లో రూ. 33లక్షలతో ఏర్పాటు

జిల్లా కేంద్రంలోని సిరిసిల్లారోడ్‌లో 2006లో మున్సిపల్ నిధులు రూ. 33 లక్షలతో 4 ఎకరాలలో అప్పటి విద్యుత్ శాఖ మంత్రి షబ్బీర్ అలీ ఈ పార్కును ప్రారంభించారు. పుర ప్రజలు అహ్లాదం, కాలక్షేపం కోసం కుటుంబసభ్యులతో సహా వచ్చి చాలాసేపు సేద తీరేవారు. సెలవు దినాలలో ఈ పార్కు ప్రజలతో రద్దీగా ఉండేది. ఉదయం చిన్నారులు, మహిళలు, వృద్ధులు, యువకులు ఈ పార్కులో వాకింగ్ చేసేవారు. మున్సిపల్ తరపున ఎంట్రీ ఫీజు కూడా వసూలు చేసేవారు.

ఆహ్లాదకరంగా మార్చాలి

ప్రస్తుతం పార్కు ఎంట్రీలో వాటర్ ఫౌంటేన్ చెడిపోయింది. క్యాంటీన్ కోసం ఏర్పాటు చేసి గది శిథిలావస్థకు చేరింది. లోపల గడ్డి ఎండిపోయింది. చిన్నపిల్లలకు ఏర్పాటు చేసిన జారుడు బండ, ఊయల లాంటి ఆట పరికరాలను చెడిపోయాయి. తాగునీటి సౌకర్యం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలో లేవు. నడక కోసం ఏర్పాటు చేసిన టైల్స్. నల్లాలు ధ్వంసమయ్యాయి. ప్రహరీ కూలిపోయింది. చిన్న పార్టీల కోసం ఏర్పాటు చేసిన స్టేజీ అధ్వానంగా మారింది. పార్కును ఆహ్లాదకరంగా మార్చాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి



మా స్నేహితులు పిల్లలతో కలిసి సెలవు రోజుల్లో రాజీవ్ పార్కుకు వెళ్లాం. పిల్లల ఆట పరికరాలు చెడిపోయాయి. పార్కులో పచ్చదనం కానరావడం లేదు. కాసేపు అహ్లాదం కోసం వెళ్లాలనుకున్న ప్రస్తుతం పార్కును చూసి వెళ్లాలని అనిపించడం లేదు. అధికారులు స్పందించాలి.

– మాసుల శ్రీనివాస్, కామారెడ్డి

సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



స్నేహితులతో కలిసి నేను ప్రతి రోజు ఉదయం రాజీవ్ పార్కు వైపు వాకింగ్‌కు వెళ్తాం. పార్కులో వాకింగ్ చేద్దామనుకుంటే టైల్స్ ధ్వంసమై వాకింగ్ చేయకుండా ఉంది. తాగునీరు, మూత్రశాలల సౌకర్యం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– మామిడాల రాజు, కామారెడ్డి

అభివృద్ధికి చర్యలు

రాజీవ్‌పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు నివేదించి మున్సిపల్ నిధులతో పార్కులో చిన్నారుల ఆట పరికరాలను, పచ్చదనం కోసం ఏర్పాట్లు చేస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

అలరించిన కుస్తీ పోటీలు



పిట్లంలో తలపడుతున్న మల్లయోధులు



లింగంపేట: భవానీపేట రామాలయం వద్ద..



నర్వలో కుస్తీ పోటీ విజేతకు వెండికడియాన్ని బహూకరిస్తున్న దాత ప్రవీణ్ గుప్తా

పిట్లం/నిజాంసాగర్/లింగంపేట/గాంధారి : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పిట్లం, లింగంపేట మండలం భవానీపేట రామాలయం వద్ద, గాంధారి మండలం గౌరారం కలాన్‌లో కుస్తీ పోటీలు నిర్వహించారు. మత్తడి పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా మహమ్మద్ నగర్ మండలం నర్వ గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక యువతతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుస్తీ వీరులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. చివరి కుస్తీ వెండి కడెం గెలుపొందిన విజేతకు బహుకరించారు. నర్వలో కుస్తీ పోటీల విజేతలకు రెండు తులాల వెండి కడియాన్ని చింతల సంతోష్ గుప్తా, మూడు తులాల వెండి కడియాన్ని ముప్పిడి ప్రవీణ్ గుప్తా, ఐదు తులాల వెండికడియాన్ని ముప్పిడి రాంప్రసాద్ గుప్తా మల్లయోధులకు బహూకరించారు. లింగంపేట మండలం రాంపూర్ గ్రామంలో బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

దేశ సంస్కృతి గొప్పది



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రపంచంలోనే భారత దేశ సంస్కృతి, సాంప్రదాయం గొప్పదని సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు.మండలంలోని గౌరారంకలాన్‌లో మాజీ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకురాలు హైమారెడ్డి, గాంధారి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తానాజీరావుతో కలిసి ఆయన శ్రీరామ నవమి వేడుకల్లో సోమవారం రాత్రి పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ మండలాధ్యక్షుడు మధుసూదన్ రావు, నాయకులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లోని పల్లెప్రకృతి వనంలో మొక్కలకు నీటిని పోయించాలన్నారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని ఆయన చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరచారి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, ఏపీవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



బాన్సువాడ రూరల్/తాడ్వాయి/నాగిరెడ్డిపేట : బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను మంగళవారం బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి రాజు, ఎంపీడీవో బషీరుద్దీన్‌తో కలిసి పరిశీలించారు.నాగిరెడ్డిపేట మండలం అచ్చాయపల్లి, రామక్కపల్లి గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ఏఈ అశోక్ పరిశీలించారు. తాడ్వాయి మండలం సంతాయిపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేక అధికారి రాజారాం మార్కింగ్ చేశారు. ఈకార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, అధికారులు తదితరులున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



దోమకొండ/తాడ్వాయి/నిజాంసాగర్/మద్నూర్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు. దోమకొండ మండలం అంబారిపేట గ్రామంలో, తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో, నిజాంసాగర్ మండలం వెల్గనూర్, మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, జక్కాపూర్, వడ్డేపల్లి, మల్లూర్ గ్రామాల్లో, మద్నూర్ మండలం సోమూర్, పెద్ద తడ్గూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. ప్రజలకు రాజ్యాంగ అవశ్యకతను వివరిస్తూ రాజ్యాంగ పరిరక్షణను తామంతా పాటుపాడుతామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి



సదాశివనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో చైర్మన్ కమలాకర్ రావు



శాబ్దిపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పిట్లం/లింగంపేట/సదాశివనగర్/ఎల్లారెడ్డి/రామారెడ్డి/కామారెడ్డి రూరల్/ మాచారెడ్డి/భిక్కనూరు/బిచ్కుంద/నిజాంసాగర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయా సొసైటీల చైర్మన్లు అన్నారు. పిట్లం మండలం చిల్లర్గి సొసైటీ పరిధిలోని కుర్తి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సొసైటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, సీఈవో సంతోష్ రెడ్డి ప్రారంభించారు.లింగంపేట మండలం పొల్కంపేట, అయిలాపూర్, లింగంపేట, కొర్పోల్, బాణాపూర్, బాణాపూర్‌తండా, శెట్పల్లి, ఎక్కపల్లితండా, భవానిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో సురేందర్, ఏఎంసీ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్మన్ జొన్నల రాజు, వ్యవసాయాధికారి అనిల్ కుమార్ ప్రారంభించారు. సదాశివనగర్‌తో పాటు తిర్మన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సదాశివ నగర్ విండో చైర్మన్ కమలాకర్ ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఏవో ప్రజాపతి, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, ఏఈవో కవిత, విండో సీఈవో విఘ్నేశ్ గౌడ్ ఉన్నారు. రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడ్లూరు ఎల్లారెడ్డి సింగల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్, అడివిలింగాల, లింగారెడ్డిపేట గ్రామాలలో ఎల్లారెడ్డి సొసైటీ చైర్మెన్ నర్సింలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాబ్దిపూర్ సింగిల్ విండో డైరెక్టర్ మాలోత్ సంతోష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు.మాచారెడ్డి మండలం సోమారంపేట, రత్నగిరిపల్లి, నెమిలిగుట్ట తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్వేత, ఏవో పవన్,ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌లు ప్రారంభించారు. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ రాజాగౌడ్ ప్రారంభించారు.బిచ్కుంద మండలం గుండెనెమ్లి, పెద్దదడ్గి, పుల్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పుల్కల్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి ప్రారంభించారు.నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పటేల్ ప్రారంభించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామ బాపన్‌పల్లి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయం వద్ద హోమం, యజ్ఞ కార్యక్రమాలు వేద పండితుడు సంజీవ్‌రావ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

తాడ్వాయిలో హనుమాన్ పల్లకీ సేవ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ పల్లకీ సేవను మాలధారులు నిర్వహించారు. హనుమాన్ చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి శబరి మాత ఆశ్రమం నుంచి కామారెడ్డి -ఎల్లారెడ్డి రహదారి గుండా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

హనుమాన్ స్వాముల మహాపడి పూజ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీర్కూర్ మండలం తిమ్మపూర్ గ్రామంలో మంగళవారం హనుమాన్ స్వాముల మహా పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ పాల్గొని ప్రవచనం చేశారు.

రాఘవపల్లిలో బోనాల పండుగ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని రాఘవపల్లిలో లింగోజి పోచమ్మ అమ్మవారికి మంగళవారం గ్రామస్తులు బోనాలు తీశారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు.

రేపు భూదాన మహా సంకల్ప పూజయజ్ఞం

కామారెడ్డి అర్బన్: స్థానిక తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీశారదామాతా ఆలయ శక్తిపీఠంలో గురువారం ఉదయం 10గంటలకు 150 మంది దంపతులతో భూదాన సంకల్ప విశేషపూజ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కే.మహిపాల్‌రెడ్డి, రాంరెడ్డి, సాయిరెడ్డిలు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

20న గాయత్రి జ్ఞాన మహాయజ్ఞం

కామారెడ్డి అర్బన్ : విశ్వశాంతి, లోక కల్యాణార్థం ఈనెల 19న జ్ఞానజ్యోతి కలశ శోభాయాత్ర, 20న నిజాంసాగర్ రోడ్డు సమీపంలోని లక్ష్మినగర్‌లో 108 కుండముల గాయత్రి జ్ఞాన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు నర్సయ్య, శ్రీనివాస్, సబ్బని హరి, వెంకటనారాయణలు తెలిపారు. హరిద్వార్‌కు చెందిన గాయత్రి పరివార్ సంస్థ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం ఉంటుందన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



దోమకొండలో ర్యాలీ తీస్తున్న తెలంగాణ సౌత్ క్యాంపస్ విద్యార్థులు

సదాశివనగర్/దోమకొండ/ఎల్లారెడ్డిరూరల్/కామారెడ్డి రూరల్ : సమాజ సేవలో విద్యార్థినులు ముందుండాలని ప్రిన్సిపాల్ శోభారాణి సూచించారు. మంగళవారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద మహిళ డిగ్రీ గురుకుల కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎల్లారెడ్డి మండలం హాజీపూర్‌తండాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా రెండవ రోజు రోడ్లను శుభ్రం చేశారు.

కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో పట్టణంలోని పీజేఆర్‌ఎస్ స్ఫూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె గురువేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రాముఖ్యత, ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. దోమకొండ మండలం కేంద్రంలో తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కింద ఏడు రోజుల పాటు నిర్వహించిన వేసవి కాల శిబిరం దోమకొండ గ్రామంలో చేపట్టగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోర్లంలో యువకుల శ్రమదానం



ముళ్లపొదలను తొలగిస్తున్న యువకులు

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం రోడ్డుపై ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. బాన్సువాడ- బోర్లం రోడ్డులో ఇటీవల వారం రోజులుగా గాలిదుమారంతో ముళ్ల చెట్లు రోడ్డుపైకి చేరి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన గ్రామ యువకులు మమ్మాయి లక్ష్మణ్, హన్మాంతు, రాజ్‌కుమార్, మన్నె సాయికుమార్, సిద్ధు అనిల్ తదితరులు ముళ్లపొదలను తొలగించారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

సంక్షిప్తం

రేషన్‌కార్డుల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

బాన్సువాడ రూరల్: రేషన్‌కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ పంచాయతి కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండలంలోని కొల్లూర్ , సోమేశ్వర్, నాగారం గ్రామాల్లో కొనసాగుతున్న ఎఫ్‌ఎస్‌సీ సర్వే పరిశీలించి పలు సూచనలు చేశారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని డీఈ విజయసారథి, ఏడీఈ మల్లేష్ తెలిపారు. ఈ నెల 10న లింగంపేట సబ్ స్టేషన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీజీఆర్‌ఎఫ్-2 చైర్మన్ ఎరుకల నారాయణ, కమిటీ సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు.

బీఈడీ కళాశాలలో ముగ్గుల పోటీలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఆహ్మద్ బీఈడీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆర్ట్ ఇన్ ఎడ్యూకేషన్ భాగంగా ఈ ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనీఫ్ పాష తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి టౌన్: పట్టణంలోని అనధికారిక లే-అవుట్, ప్లాట్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ -2020 ద్వారా 25శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమబద్ధీకరణ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేది లోపు ఎల్‌ఆర్‌ఎస్‌కు గడువు ఉందన్నారు. అలాగే దరఖాస్తులలో పేరు, ఫోన్ నంబర్‌లు తప్పులు ఉంటే సవరించుకోవాలన్నారు. హెల్ప్ డెస్కును వినియోగించుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్

పిట్లం/బీబీపేట : పిట్లం మండలం చిల్లర్గి గ్రామం బోయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో, బీబీపేట మండలం ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సౌభాగ్య మాట్లాడుతూ మహిళలకు, బాలింతలకు, గర్భిణిలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

డ్రా పద్ధతిలో 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

ఎల్లారెడ్డి: అర్హులైన పేదలకు డ్రా పద్ధతిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రం అందించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అర్హులైన 259 మందికి డ్రా పద్ధతిలో పారదర్శకంగా డబుల్ బెడ్‌రూంలను కేటాయించారన్నారు.

చిన్నారులకు కంటి పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కంటి పరీక్షలను మంగళవారం కంటి వైద్యుడు రవీందర్ పటేల్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు కళ్ల పరిరక్షణకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

భిక్కనూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు వైద్య సిబ్బంది మంగళవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ దెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.